క్లుప్తంగా

మే 22 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు మే 22వ తేదీ నుంచి జరుగుతాయని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న ఆదివారం తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థినులు మే 15వ తేదీ నుంచి అప్లికేషన్ ఫారంలు తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మే 22వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. తరగతులు జూన్ 1వ తేదీ నుంచే ప్రారంభమవుతాయని వెల్లడించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

1న మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: మండల సర్వసభ్య సమావేశం మే 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో మే 1న ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

విద్యుత్ సరఫరాకు చంద్రబాబు ఎఫెక్ట్

- 4 గంటల పాటు నిలిచిన సరఫరా


కరెంటు తీగలకు సమీపంలో ఏర్పాటు చేసిన సౌండ్ బాక్సుల స్టాండ్

మంత్రాలయం: అసలే వేసవి.. ఊపిరి ఆడనంతగా ఉక్కపోత. ఫ్యాన్లు ఆడకపోతే ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. కాసేపు కరెంట్ లేదంటే తలలు పట్టుకునే తరుణం. ఇలాంటి సమయంలో కౌతాళం వాసులకు చంద్రబాబు చిర్రెత్తించారు. ఆయన రోడ్‌షో కారణంగా కౌతాళం మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కరెంటు లేక మండల వాసులు అవస్థలు పడ్డారు. ఉక్కపోతతో అల్లాడిపోవడమే గాక వ్యాపారాలు, ఇతర కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా విద్యుత్ తీగలకు సమీపంలో సౌండ్ బాక్సుల స్టాండ్‌ను అమర్చడమే ఇందుకు కారణం. కాస్త దూరంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటే విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేవారు. దీనికితోడు కార్మికులు స్టాండ్‌ను తొలగించడంలో ఆలస్యం చేయడంతో గంటల తరబడి అంతరాయం కలిగింది. అలాగే చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జెడ్పీ పాఠశాల ముఖద్వారంలో పచ్చని చెట్లను నరికారు. చిన్న చిన్న కొమ్మలను సైతం వదలకుండా జేసీబీతో తొలగించారు.

పోటెత్తిన అభిమానం

- వైఎస్సార్‌సీపీ రోడ్ షోలో జన నీరాజనం
- పార్టీ శ్రేణులలో జోష్


అభ్యర్థి బుట్టా రేణుక రోడ్ షోలో పెద్దసంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు

నందవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నందవరం మండలంలో నిర్వహించిన రోడ్ షోలో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. ఈ రోడ్ షో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. కార్యకర్తలు, అభిమానులు, జనం బుట్టా రేణుకకు నీరాజనం పలికారు. ఆదివారం మండలంలోని జగ్గాపురం, హెచ్ బాపురం, ధర్మపురం, హాలహర్వి గ్రామాల్లో చేపట్టిన రోడ్‌షోలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సందడితో పండుగ వాతావరణం కనిపించింది. కార్యకర్తలు, అభిమానులు బ్యాండు మేళాలు, బీరప్ప డోలు, డ్రమ్స్‌లతో పాటు పూలు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు, యువకులు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు తామంతా సిద్ధం అంటూ సీఎం జగనన్న చిత్రాలతో కూడిన ఫ్లకార్డులు, జెండాలను ప్రదర్శించి రోడ్ షోలో చిందులేశారు. అనంతరం బుట్టా రేణుక ప్రసంగం యువత, మహిళలను ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా నీలకంఠప్ప, పేట శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రఘురెడ్డి, సుధాకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ జెండాతో పాల్గొన్న వృద్ధురాలు

టీడీపీ కార్యాలయాల మూసివేత ఖాయం


రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

మంత్రాలయం/కోసిగి: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీకి ఓటమి తప్పదని, ఆ పార్టీ కార్యాలయాలకు తాళాలు వేసుకోవాల్సిందేనని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలం సాతనూరు, అగసనూరు గ్రామాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో కలిసి పర్యటించారు. బీవై రామయ్య మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలిచ్చి గద్దెనెక్కి ఒక్కటీ అమలుచేయకుండా ప్రజలను నిలువునా మోసగించారన్నారు. ఆయన మాటలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని, ఇక తట్టాబుట్టా సర్దుకుని హైదరాబాద్‌కు పోవాల్సిందేనన్నారు. వైఎస్ జగనన్న మాట ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారని స్పష్టం చేశారు. చంద్రబాబు సైకిల్ ముక్కలైపోతుందని, ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేసుకోవడం నిరుపయోగమేమన్నారు. మంత్రాలయంలో టీడీపీ నుంచి పోటీచేస్తున్న ఎన్.రాఘవేంద్రరెడ్డి అనవసరంగా కష్టపడుతున్నారని, నాలుగోసారి వై.బాలనాగిరెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు.

చంద్రబాబుకు వణుకు: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సాతనూరు, అగసనూరుతోపాటు తుంబిగనూరు, కందకూరు, కడదొడ్డి, కామన్‌దొడ్డి, అర్లబండ గ్రామాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేత చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇస్తూ ప్రజలను మోసగించే పనిలో పడ్డారని ఆరోపించారు. అధికార దాహంతో సూపర్ సిక్స్ పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నాన్న రామిరెడ్డిని తామే చేరదీశామని, తెలుగుదేశం పార్టీ అన్యాయం చేస్తే తాము దగ్గరకు తీసుకుని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవిని ఇచ్చినట్లు గుర్తుచేశారు. గతం మరచి తమ పార్టీని వీడి టీడీపీ నుంచి పోటీ చేయడం విడ్డూరమన్నారు. మంత్రాలయంలో టీడీపీ తరఫున ఎవ్వరు పోటీ చేసినా గెలవడం కష్టమేనని చంద్రబాబుకు తెలుసని, ఈ నేపథ్యంలోనే నారా లోకేష్, బాలకృష్ణ, చంద్రబాబు వరుసగా పర్యటిస్తున్నారని చెప్పారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం చేసిన పనులు, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, బెట్టనగౌడ్, పవిత్రపాటిల్, ఈరన్న, నాగరాజు, దళవాయి మంగమ్మ, మంగమ్మ, విశ్వనాథ్‌స్వామి, వడ్డె ఉలిగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన అగర్‌బత్తీ తయారీ కార్మికులు

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో కొడలపేట వీధిలో నివాసముంటున్న 200 మంది అగర్‌బత్తిలు తయారుచేసే కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అగర్‌బత్తి ఫ్యాక్టరీ నిర్వాహకులు మహ్మద్‌షాదిక్, బాషా ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో పార్టీలోకి చేరినట్లు చెప్పారు. 200 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న మహ్మద్‌షాదిక్ సేవలను కొనియాడారు. మతతత్వ బీజేపీకి గుడ్‌బై చెప్పి తమ పార్టీలోకి చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను జగనన్న చేసి చూపించారని చెప్పారు. ప్రధానంగా విద్య, వైద్యంకు పెద్దపీట వేశారన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా పథకాలు రూపొందించారని కొనియాడారు. అబద్ధాల కోరు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గతి అధోగతిపాలేనని చెప్పుకొచ్చారు. లోకేష్‌ను సీఎంను చేయడమే చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మొదట్లో బీజేపీ అభ్యర్థి పార్థసారథికి మద్దతు ఇవ్వనంటూ పలికిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఇప్పుడు ఆయనకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. మీనాక్షినాయుడు, జనసేన ఆదోని ఇన్‌చార్జ్ మల్లప్పకు డబ్బు ముట్టజెప్పడంతోనే అభ్యర్థి పార్థసారథికి అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి మాట మార్చే నాయకులకు రాజకీయ మనుగడ ఉంటుందా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి


అర్లయ్యగుడి వీధిలో ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని వివరిస్తూ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు విస్తృత ప్రచారం చేశారు. స్థానిక 8, 9 వార్డుల్లో ఆదివారం యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి, గౌతమి రెడ్డి, మనోవిద్యారెడ్డి, హిరణ్మయిరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని రెట్టింపు పథకాలను పొందుదామని ప్రజలకు వివరించారు. జగనన్న ప్రవేశపెట్టిన 2024 మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేశారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు నరసింహులు, అశోక్, ప్రసాద్, సునీతారెడ్డి, తులసిరెడ్డి, రామయ్య, తాయన్న, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మేని'ఫెస్టివల్' ధమాకా


హెచ్.మురవణిలో వృద్ధులకు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మేనిఫెస్టో ధమాకా ప్రకటించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో సర్పంచ్ జానకమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న మాట ఇచ్చారంటే కచ్చితంగా చేసి తీరతారని ప్రతి ఒక్కరికీ నమ్మకముందని చెప్పారు. నవరత్నాలు ప్లస్‌తో రూపొందించిన మేనిఫెస్టోతో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. అమలు చేయలేని హామీలతో మరోసారి ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడానికి చంద్రబాబు వస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రఘురాముడు, రామాంజినేయులు, దేవదానం, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కౌతాళం: గడపకు గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఉరుకుందలో ఆదివారం గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేసిన మేలును వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రదర్శించాలి

- వంద మీటర్ల వరకు పటిష్ట బందోబస్తు ఉండేలా చర్యలు
- ఎన్నికల అబ్జర్వర్ మిర్‌తారిఖ్ అలీ


సుల్తానాపురంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అబ్జర్వర్ మిర్‌తారిఖ్ అలీ

ఆదోని రూరల్: పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు సంబంధించిన వివరాలను ప్రదర్శించాలని (ఎన్నికల అబ్జర్వర్) సాధారణ ఎన్నికల పరిశీలకులు మిర్‌తారీఖ్ అలీ సూచించారు. ఆయన ఆదివారం ఆదోని మండలంలోని ఆరేకల్, పెద్దపెండేకల్, సాంబగల్, చిన్నపెండేకల్, నెట్టేకల్, బైచిగేరి, నాగలాపురం, కపటి, పెసలబండ, సుల్తానాపురం, దొడ్డనగేరి, కొత్తూరు, మాంత్రికి గ్రామాల్లో ఉన్న దాదాపు 20 పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్‌కు రెండు రోజుల ముందు పోలింగ్ కేంద్రం నంబర్, ఓటర్ల సంఖ్య, పురుషులు, మహిళలు, ఇతర ఓటర్ల సంఖ్య తదితర వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం నుంచి వంద మీటర్ల వరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ప్రదేశంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటే ప్రతి పోలింగ్ కేంద్రానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున షామియానా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, సెక్టోరల్ ఆఫీసర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన


అలువాలలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తరఫున ఆమె తనయుడు ప్రతుల్ ఆదివారం సాయంత్రం మండలంలోని అలువాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు, పెత్తందారుల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు పొందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, నాయకులు బందెనవాజ్, దొరబాబు, మహేశ్వర రెడ్డి, రవికుమార్ నాయుడు, మనోహర్ రెడ్డి, రాముడు, గోవింద్, దివకర్, మల్లీ, మురళి, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తారా.. లేదా?


చంద్రబాబు రోడ్ షో మధ్యలోనే జారుకుంటున్న కార్యకర్తలు

మంత్రాలయం/కౌతాళం: గెలిపిస్తారా..లేదా..? సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటారా.. లేదా.? అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం మంత్రాలయం నియోజకవర్గం కౌతాళంలో రోడ్‌షో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నీళ్లున్నా గ్రామాలకు తాగునీరుతో పాటు సాగునీరు అందించలేకపోయారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, కర్నూలు పార్లమెంటు స్థానం తామే గెలుస్తున్నామంటూ చెప్పట్లు కొట్టండి అని కోరారు. మీ వాగులు, వంకలు, నదిలో ఇసుకను దోపిడీ చేశారే గానీ ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. రాయలసీమలో ఎన్నో ప్రాజెక్టుల్ని రద్దు చేశాడని మళ్లీ అధికారంలోకి వచ్చి వాటిని పూర్తి చేస్తానని తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు, వేదవతి ప్రాజెక్టు, గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్‌లను గాలికి వదిలేశారని విమర్శించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు క్వాటర్ మద్యం బాటిల్ ఎంత అనగా జనం రూ.120 అని చెప్పడంతో లేదు రూ. 40 మాత్రమే ఉండిందని, ఇప్పుడు రూ.200కు అమ్ముతున్నారని ఆరోపించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ అభ్యర్థి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, బీజేపీ నాయకుడు రామకృష్ణ, మాజీ ఎంపీపీ చందఖాన్, పులిగయ్య, చెన్నబసప్ప, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

- ప్రజలను ముంచడంలో చంద్రబాబు దిట్ట
- టీడీపీ అబద్ధాలు, మోసాలకు కాలం చెల్లింది
- ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక


సగర కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: పేదల సంక్షేమం.. సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యపడిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. అబద్ధపు మాటలు.. మోసపూరిత హామీలతో ప్రజలను ముంచడంలో చంద్రబాబు దిట్ట అని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. పేదల బతుకుల్లో వెలుగులు నిండాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని' ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మిగనూరు సగర కులస్తులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. బుట్టా రేణుక మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు, గౌరవం దక్కిందటంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం కోటా పదవులతోపాటు, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ పదవులేగాక చట్టసభల సభ్యులుగా అధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు.

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాలనలో బీసీలకు మేలు జరిగిందా అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలకు వైఎస్ జగన్ ఆపద్బాంధవుడిగా మారారని, లోటు బడ్జెట్ ఉన్నా.. కరోనా రక్కసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసినా, ప్రజలకిచ్చిన మాట కోసం.. ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసేందుకు ఎక్కడా రాజీ పడలేదన్నారు. సంక్షేమ పథకాలను మరింతగా పెంచుతూ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. సగర (ఉప్పర) కులస్తుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి కార్యాచరణ రూపొందిస్తామని హామీఇచ్చారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మెన్ వై.రుద్రగౌడ్, బుట్టా శివనీలకంఠప్ప, ఉప్పర సంఘం రాష్ట్ర నాయకులు ఏపీ వీరన్న, జిల్లా అధ్యక్షులు తెర్నేకల్ సత్యన్న, యూకే వీరేంద్ర, కొమ్మురాజు, యూకే రమేష్, కొమ్ము ఈరన్న, బంగి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆదరించండి


హెచ్.బాపురంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

నందవరం: ఐదేళ్ల పాటు పేదల సంక్షేమ కోసం ఎన్నో పథకాలు అమలుచేసిన సీఎం జగనన్నను మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. ఆమె ఆదివారం నందవరం మండలంలోని జగ్గాపురం, హెచ్.బాపురం, హాలహర్వి, ధర్మపురం గ్రామాల్లో సర్పంచ్ మునెమ్మ, ఎంపీటీసీ హనుమంతమ్మతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అందులో పేర్కొన్న 99 శాతం హామీలను జగనన్న నెరవేర్చారన్నారు. 2024 మేనిఫెస్టో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సంక్షేమాభివృద్ధికి కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

నవరత్నాలతో సుపరిపాలన : బీఆర్ బసిరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం నెలకొందని ఆ పార్టీ సీనియర్ నాయకులు బీఆర్ బసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన చేరువైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. ఎన్నికల్లో గెలవలేమని తెలిసి అలవిగానీ హామీలు ఇస్తున్న చంద్రబాబును నమ్మి మోసపోవద్దన్నారు. మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు శ్రీనివాసరెడ్డి, రామకోటేశ్వరరెడ్డి, భీమిరెడ్డి, ఈరన్న, నరసరాజు, రాఘవేంద్ర, రాముడు, నరసన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సువర్ణపాలన : సిట్రా సత్యనారాయణమ్మ

రాష్ట్రంలో సువర్ణపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ పిలుపునిచ్చారు. ఆమె మాట్లాడుతూ.. అవినీతి రహిత పాలన, ప్రజల చేంతకే సేవలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి సంక్షేమ పథకాలను కొనసాగించారని కొనియాడారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలం కనకవీడు పేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ వార్డు మెంబర్ తిమ్మప్ప, బి.ఉరుకుందు, మేకల ఎర్రన్న, వడ్డె చంద్రన్నతో పాటు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి బుట్టా రేణుక, శివనీలకంఠ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


బోయ పెద్ద లక్ష్మన్న (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న (64) కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం


ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కడిమెట్ల టీడీపీ శ్రేణులు


వైఎస్సార్‌సీపీలో చేరిన రాళ్లదొడ్డి గ్రామస్తులు


వైఎస్సార్‌సీపీలో చేరిన కులుమాల టీడీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దవుతాయని, సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని, మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఖాళీ అవుతున్న టీడీపీ

మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఈడిగ దుబ్బ ఉరుకుందు, మాల శేఖన్న, దరగయ్య, బోయ కేశన్న, మాల పెద్దయ్యలతో పాటు 200 మంది టీడీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోయ తిమ్మయ్య, దస్తగిరి, బి.రంగన్న, రామాంజినేయులు, తిమ్మప్ప, మందకల్లు, బావరెడ్డి, బోయ గుంటెప్ప, చంద్రశేఖర్, రంజాన్, రంగనాథ్, కాంట్రాక్టర్ తిమ్మప్ప, చిన్న బడేసాబ్, ప్రభాకర్‌లతో పాటు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎంపీపీ కేశన్న, నాయకులు నాగభూషణం రెడ్డి, కడిమెట్ల తిమ్మప్పాచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే గోనెగండ్ల మండల పరిధిలోని కులుమాల గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు మల్లేష్, సుధాకర్, బాబు, జయన్న, చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు, బొజ్జన్న, రమేష్,గోనెగండ్ల శ్రీను తదితరులు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కులుమాల మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, డాక్టర్ శివ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రచారం

ఎమ్మిగనూరురూరల్: ఈనెల 29వ తేదీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఎమ్మిగనూరు మండలంలోని గ్రామాల్లో ప్రచారం ప్రారంభించనున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బుట్టా నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో సోమవారం వెంకటగిరి, పరమాన్‌దొడ్డి, నక్కలమిట్ట, బనవాసిఫారం, సాయంత్రం చెన్నాపురం, బోడబండ, కోటేకల్, దేవబెట్ట గ్రామాల్లో, 30న మసీదుపురం, మాచుమాన్‌దొడ్డి, ఎస్.నాగలాపురం, సాయంత్రం కందనాతి, కడివెళ్ల గ్రామాల్లో, మే 1న కె.తిమ్మాపురం, టీఎస్.కూళ్లూరు, సాయంత్రం కె.నాగలాపురం, కలుగోట్ల, సోగనూరు గ్రామాల్లో, 2న గువ్వలదొడ్డి, పెసలదిన్నె, గార్లదిన్నె, సాయంత్రం పార్లపల్లి, ఏనుగు బాల, దైవందిన్నె గ్రామాల్లో, 3న బనవాసి, మల్కాపురం గ్రామాల్లో ప్రచారం ఉంటుదని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.